**23-08-2024** ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - దుఃఖహర్త-సుఖకర్త అయిన తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ దుఃఖాలన్నీ దూరమైపోతాయి, అంతిమ మతిని బట్టి గతి ఏర్పడుతుంది"

ప్రశ్న:- తండ్రి పిల్లలైన మీకు నడుస్తూ-తిరుగుతూ స్మృతిలో ఉండాలి అనే డైరెక్షన్ ను ఎందుకు ఇచ్చారు?

జవాబు:- 1. ఎందుకంటే స్మృతి ద్వారానే జన్మజన్మాంతరాల పాపాల భారము తొలగుతుంది, 2. స్మృతి ద్వారానే ఆత్మ సతోప్రధానముగా అవుతుంది, 3. ఇప్పటి నుండే స్మృతిలో ఉండే అభ్యాసము ఉన్నట్లయితే చివరి సమయంలో ఒక్క తండ్రి స్మృతిలో ఉండగలుగుతారు. అంతిమ సమయం కోసమే - అంతిమ సమయంలో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అన్న గాయనం ఉంది. 4. తండ్రిని స్మృతి చేయడం ద్వారా 21 జన్మల సుఖము ఎదురుగా వస్తుంది. తండ్రి వంటి మధురమైనవారు ప్రపంచములో ఎవ్వరూ లేరు, అందుకే తండ్రి డైరెక్షన్ ఏమిటంటే - పిల్లలూ, నడుస్తూ-తిరుగుతూ నన్నే స్మృతి చేయండి.

ఓం శాంతి. ఎవరి స్మృతిలో కూర్చున్నారు? ఇది అందరినీ దుఃఖాల నుండి విడిపించే ఆ ఒక్కరితో ఉండే ప్రియాతి ప్రియమైన సంబంధము. తండ్రి పిల్లలను చూస్తే అన్ని పాపాలూ అంతమైపోతూ ఉంటాయి. ఆత్మ సతోప్రధానత వైపుకు వెళ్తుంది. దుఃఖమైతే అపారంగా ఉంది కదా. దుఃఖహర్త, సుఖకర్త అని గానం కూడా చేస్తారు. ఇప్పుడు తండ్రి మిమ్మల్ని సత్యాతి-సత్యంగా అన్ని దుఃఖాల నుండి విడిపించడానికి వచ్చారు. స్వర్గములో దుఃఖము యొక్క నామ-రూపాలు ఉండవు. ఇటువంటి తండ్రిని స్మృతి చేయడం చాలా అవసరము. తండ్రికి పిల్లలపై ప్రేమ ఉంటుంది కదా, తండ్రికి ఏయే పిల్లలపై ప్రేమ ఉందో మీకు తెలుసు. వారు పిల్లలకు అర్థం చేయించారు - స్వయాన్ని ఆత్మగా భావించండి, దేహముగా భావించకండి. మంచి రత్నాలు ఎవరైతే ఉన్నారో వారు తండ్రిని నడుస్తూ, తిరుగుతూ స్మృతి చేస్తారు, ఇలా కూడా ఎందుకు చెప్తున్నారు? ఎందుకంటే జన్మజన్మాంతరాల నుండి మీ పాపాల కుండ నిండి ఉంది. కావున ఈ స్మృతియాత్ర ద్వారానే మీరు పాపాత్ముల నుండి పుణ్యాత్ములుగా అవుతారు. ఇది కూడా పిల్లలైన మీకు తెలుసు - ఇది పాత తనువు. దుఃఖము ఆత్మకే లభిస్తుంది. శరీరానికి దెబ్బ తగలడంతో ఆత్మకు దుఃఖము అనుభవమవుతుంది. నేను రోగగ్రస్థముగా, దుఃఖితముగా ఉన్నాను అని ఆత్మ అంటుంది. ఇది దుఃఖమయమైన ప్రపంచము. ఎక్కడికి వెళ్ళినా అంతా దుఃఖమే దుఃఖము ఉంది. సుఖధామములోనైతే దుఃఖము ఉండదు. దుఃఖము అన్న పేరు తీసుకున్నారంటేనే మీరు దుఃఖధామములో ఉన్నట్లే. సుఖధామములోనైతే కొద్దిగా కూడా దుఃఖము ఉండదు. సమయం కూడా ఇంకా కొద్దిగానే ఉంది, ఇందులో తండ్రిని స్మృతి చేసే పురుషార్థమును పూర్తిగా చేయాలి. ఎంతగా స్మృతి చేస్తూ ఉంటారో అంతగా సతోప్రధానముగా అవుతూ ఉంటారు. పురుషార్థం చేసి అవస్థను ఎలా తయారుచేసుకోవాలంటే, ఇక చివరిలో మీకు ఒక్క తండ్రి తప్ప ఇంకేమీ గుర్తుకురాకూడదు. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అని ఒక పాట కూడా ఉంది, ఇది అంత్యకాలమే కదా. ఇది పాత ప్రపంచమైన దుఃఖధామము యొక్క అంతము. ఇప్పుడు మీరు సుఖధామములోకి వెళ్ళే పురుషార్థం చేస్తారు. మీరు శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అయ్యారు. ఇది గుర్తు ఉండాలి కదా. శూద్రులకు దుఃఖము ఉంటుంది, మనం దుఃఖము నుండి బయటపడి ఇప్పుడు మళ్ళీ శిఖరంపైకి ఎక్కుతున్నాము కావున ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. వారు అతి ప్రియమైన తండ్రి. వారికన్నా మధురమైనవారు ఇంకెవరు ఉంటారు? ఆత్మ ఆ పరమపిత పరమాత్మనే స్మృతి చేస్తుంది కదా. వారు సర్వాత్మలకూ తండ్రి, వారికన్నా మధురమైనవారు ఈ ప్రపంచంలో ఇంకెవ్వరూ ఉండరు. ఎంతోమంది పిల్లలు ఉన్నారు, వారు ఎంత సమయంలో గుర్తుకు వస్తూ ఉండవచ్చు? క్షణములో. అచ్చా, మొత్తం సృష్టి చక్రము ఎలా తిరుగుతూ ఉంటుంది? అది కూడా పిల్లలైన మీ బుద్ధిలో అర్థ సహితముగా ఉంది. ఏదైనా డ్రామా చూసి వస్తే, డ్రామా గుర్తుందా? అని ఎవరైనా అడిగితే, అవును అని అనడంతోనే ప్రారంభం నుండి చివరి వరకు మొత్తం బుద్ధిలోకి వచ్చేస్తుంది. కానీ దానిని వర్ణన చేసి వినిపించేందుకైతే సమయం పడుతుంది. బాబా అనంతమైన తండ్రి, వారిని స్మృతి చేయడంతోనే 21 జన్మల సుఖము ఎదురుగా వచ్చేస్తుంది. తండ్రి ద్వారా ఈ వారసత్వము లభిస్తుంది. క్షణములో పిల్లలకు తండ్రి వారసత్వము ఎదురుగా వచ్చేస్తుంది. కొడుకు జన్మించగానే, వారసుడు జన్మించాడు అని తండ్రికి తెలుస్తుంది. మొత్తం ఆస్తి అంతా గుర్తుకువస్తుంది. పిల్లలైన మీరు కూడా ఒంటరిగా వేర్వేరుగా ఉన్నారు, వారసత్వము వేర్వేరుగా లభిస్తుంది కదా. మీరు వేర్వేరుగా స్మృతి చేస్తారు. మనం అనంతమైన తండ్రికి వారసులము. సత్యయుగములోనైతే ఒకే కొడుకు ఉంటాడు. అతను మొత్తం ఆస్తి అంతటికీ వారసుడు అవుతారు. పిల్లలకు తండ్రి లభించారు మరియు క్షణములో విశ్వాధిపతులుగా అయ్యారు, దానికి ఎక్కువ సమయం పట్టదు. తండ్రి అంటారు, మీరు స్వయాన్ని ఆత్మగా

భావించండి, స్త్రీగా భావించకండి. ఆత్మ అయితే కొడుకు కదా. బాబా అంటారు, నాకు పిల్లలందరూ గుర్తుకువస్తారు. ఆత్మలందరూ పరస్పరం సోదరులు. సర్వ ధర్మాలవారు ఎవరైతే వస్తారో వారు అన్ని ధర్మాలవారూ పరస్పరం సోదరులు అని అంటారు కానీ అర్థం చేసుకోరు. మనం బాబాకు అతి ప్రియమైన పిల్లలమని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. తండ్రి నుండి పూర్తి అనంతమైన వారసత్వం తప్పకుండా లభిస్తుంది. దానిని ఎలా తీసుకుంటారు? అది కూడా పిల్లలైన మీకు క్షణములో గుర్తుకు వచ్చేస్తుంది. మనం సతోప్రధానముగా ఉండేవారము, మళ్ళీ తమోప్రధానముగా అయ్యాము, ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. బాబా నుండి మనము స్వర్గ సుఖాల వారసత్వాన్ని తీసుకోవాలి అని మీకు తెలుసు.

తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావించండి. దేహమైతే వినాశీ అయినది. ఆత్మయే శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. మళ్ళీ వెళ్ళి ఇంకొక కొత్త శరీరాన్ని గర్భములో తీసుకుంటుంది. పిండము ఎప్పుడైతే తయారవుతుందో అప్పుడు ఆత్మ అందులోకి ప్రవేశిస్తుంది, కానీ తాను రావణునికి వశమై ఉంటుంది. వికారాలకు వశమై జైలులోకి వెళ్తారు. అక్కడైతే రావణుడు ఉండనే ఉండడు, దుఃఖము విషయమే ఉండదు. ఎప్పుడైతే వృద్ధులుగా అవుతారో అప్పుడు తెలుస్తుంది - ఇప్పుడిక ఈ శరీరాన్ని వదిలి మేము వెళ్ళి ఇంకొక శరీరములోకి ప్రవేశిస్తాము అని. అక్కడైతే భయం యొక్క విషయమేదీ ఉండదు. ఇక్కడ ఎంతగా భయపడతారు. అక్కడ నిర్భయులుగా ఉంటారు. తండ్రి పిల్లలైన మిమ్మల్ని అపారమైన సుఖాలలోకి తీసుకువెళ్తారు. సత్యయుగములో అపారమైన సుఖము ఉంటుంది, కలియుగములో అపారమైన దుఃఖము ఉంది, అందుకే దీనిని దుఃఖధామము అని అంటారు. తండ్రి అయితే ఎటువంటి కష్టాన్ని ఇవ్వరు. గృహస్థ వ్యవహారములో ఉండండి, పిల్లలను సంభాళించండి కానీ కేవలం తండ్రిని స్మృతి చేయండి. గురువులు-పండితులు మొదలైనవారందరినీ వదిలివేయండి. నేనైతే గురువులందరికన్నా పెద్దవాడిని కదా. వారంతా నా రచనయే. నన్ను తప్ప ఇంకెవ్వరినీ పతిత-పావనా అని అనరు. బ్రహ్మ, విష్ణు, శంకరులను పతిత-పావనా అని అంటారా? లేదు. నన్ను తప్ప దేవతలను కూడా అలా అనలేరు. ఇప్పుడు పిల్లలైన మీరు గంగను పతిత-పావని అని అంటారా? ఈ నీటి నదులైతే ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి. గంగ, బ్రహ్మపుత్ర మొదలైనవి కూడా మొదటి నుండీ ఉన్నాయి. వీటిలోనైతే స్నానాలు చేస్తూనే ఉంటారు. వర్షాలు కురిస్తే వరదలు వస్తాయి. ఇది కూడా దుఃఖమే కదా. అపారమైన దుఃఖము ఉంది. వరదల్లో ఎంతమంది మనుష్యులు మరణించారో చూడండి. సత్యయుగములో దుఃఖపు విషయము ఉండదు, జంతువులకు కూడా దుఃఖము ఉండదు, వాటికి కూడా అకాలమృత్యువు ఉండదు. ఈ డ్రామాయే ఈ విధంగా రచింపబడి ఉంది. భక్తిలో పాడుతారు - బాబా, మీరు ఎప్పుడైతే వస్తారో అప్పుడు మేము మీ వారిగానే అవుతాము అని. వారు రావడమైతే వస్తారు కదా. దుఃఖధామము యొక్క అంతిమము మరియు సుఖధామము యొక్క ఆది, ఈ రెండింటి మధ్యలోనే వారు వస్తారు. కానీ ఇది ఎవ్వరికీ తెలియదు. సృష్టి ఆయువు ఎంత ఉంటుంది, ఇది కూడా తెలియదు. తండ్రి ఎంత సహజముగా తెలియజేస్తారు. సృష్టిచక్రము యొక్క ఆయువు 5000 సంవత్సరాలు అని ఇంతకుముందు మీకు ఏమైనా తెలుసా? వారైతే లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. ప్రతి యుగము 1250 సంవత్సరాలు ఉంటుందని ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు. స్వస్తిక్ లో పూర్తిగా నాలుగు భాగాలు ఉండడం చూపిస్తారు. కొద్దిగా కూడా తేడా ఉండదు. ఖచ్చితమైన లెక్క ఉండాలి అని వివేకం కూడా చెప్తుంది. జగన్నాథ పురిలో కూడా కుండలో అన్నం వండుతారు, అది దానంతట అదే పూర్తిగా నాలుగు భాగాలు అయిపోతుంది, అటువంటి యుక్తి రచించబడి ఉంది. అక్కడ అన్నం ఎక్కువ తింటారు. జగన్నాథ్ అనండి లేక శ్రీనాథ్ అనండి, విషయం ఒక్కటే. ఇరువురినీ నల్లగా చూపిస్తారు. శ్రీనాథుని మందిరములో నేతి కుండలు ఉంటాయి. అక్కడ అన్నీ నేతిలో వేయించబడ్డ మంచి-మంచి వస్తువులు లభిస్తాయి. బయట దుకాణాలు ఉంటాయి. ఎంత నైవేద్యం పెడుతూ ఉండవచ్చు. యాత్రికులందరూ వెళ్ళి దుకాణదారుల నుండి తీసుకుంటారు. జగన్నాథ్ పురిలో అంతా అన్నమే అన్నము ఉంటుంది. వారు జగన్నాథుడు, వీరు శ్రీనాథుడు. సుఖధామాన్ని మరియు దుఃఖధామాన్ని చూపిస్తారు. శ్రీనాథుడు సుఖధామానికి చెందినవారు, జగన్నాథుడు దుఃఖధామానికి చెందినవారు. ఈ సమయంలో కామచితి పైకి ఎక్కి నల్లగా అయిపోయారు. జగన్నాథునికి కేవలం అన్నం నైవేద్యం పెట్టడం జరుగుతుంది. ఇతడిని పేదవానిగా, అతడిని షావుకారుగా చూపిస్తారు. జ్ఞానసాగరుడు ఒక్క తండ్రే. భక్తిని అజ్ఞానం అని అంటారు, దాని ద్వారా ఏమీ లభించదు. అక్కడ కేవలం గురువులకు సంపాదన ఎంతో జరుగుతూ ఉంటుంది. ఎవరైనా తెలివైనవారు ఉంటే, అతని నుండి ఏవరైనా నేర్చుకుంటే అతను మా గురువు, అతను మాకు ఇది నేర్పించారు అని అంటారు. వారందరూ దైహికమైనవారు, జన్మలు తీసుకునేవారు.

ఇప్పుడు మీతో ఎవరు ఉన్నారు? విచిత్రుడైన తండ్రి. వారు అంటారు, ఇది నా శరీరము కాదు, ఇది మీ దాదా శరీరము,

ఇతను పూర్తి 84 జన్మలు తీసుకున్నారు, ఇతని అనేక జన్మల అంతిమంలో మిమ్మల్ని సుఖధామములోకి తీసుకువెళ్ళేందుకు నేను ఇతనిలోకి ప్రవేశిస్తాను, ఇతడిని గోముఖము అని కూడా అంటారు. గోముఖము వద్దకు ఎంత దూరదూరాల నుండి వస్తారు. ఇక్కడ కూడా గోముఖము ఉంది. పర్వతాల నుండి నీరైతే తప్పకుండా వస్తుంది. బావిలోకి కూడా రోజు నీరు పర్వతాల నుండి వస్తుంది, అవి ఎప్పుడూ ఆగిపోవు. నీరు వస్తూనే ఉంటుంది. ఎక్కడి నుండైనా కాలువ వెలువడిందంటే దానిని ఇక గంగాజలము అని అనేస్తారు. అక్కడికి వెళ్ళి స్నానాలు చేస్తారు, దానిని గంగాజలముగా భావిస్తారు. కానీ ఈ నీటి ద్వారా పతితుల నుండి పావనులుగా అవుతారా. తండ్రి అంటారు, పతిత-పావనుడిని నేనే, ఓ ఆత్మల్లారా, నన్నొక్కరినే స్మృతి చేయండి. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలనూ వదిలి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేసినట్లయితే మీ జన్మజన్మాంతరాల పాపాలు భస్మమవుతాయి. తండ్రి మిమ్మల్ని జన్మజన్మాంతరాల పాపాల నుండి విడిపిస్తారు. ఈ సమయంలోనైతే ప్రపంచంలో అందరూ పాపాలు చేస్తూ ఉంటారు, కర్మభోగము కదా. గత జన్మలో పాపాలు చేసారు, ఇవి 63 జన్మల లెక్కాచారాలు. కొద్దికొద్దిగా కళలు తగ్గిపోతూ ఉంటాయి. ఏ విధంగా చంద్రుని కళలు తగ్గుతూ ఉంటాయి కదా, అలాగే ఇది అనంతమైన పగలు-రాత్రి. ఇప్పుడు మొత్తం ప్రపంచమంతటిపై, అందులోనూ విశేషముగా భారత్ పై రాహువు దశ కూర్చొని ఉంది. రాహు గ్రహణం పట్టి ఉంది. ఇప్పుడు పిల్లలైన మీరు శ్యామము నుండి సుందరముగా అవుతున్నారు, అందుకే శ్రీకృష్ణుడిని కూడా శ్యామసుందరుడు అని అంటారు. వారు నిజంగానే నల్లగా చేస్తారు. కామచితిపైకి ఎక్కారు కావున గుర్తుగా అలా చూపించారు. కానీ మనుష్యుల బుద్ధి ఏమాత్రమూ నడవదు. ఒకచోట నల్లగా, ఇంకొకచోట తెల్లగా చూపిస్తారు. ఇప్పుడు మీరు తెల్లగా అయ్యేందుకు పురుషార్థం చేస్తున్నారు. సతోప్రధానముగా అయ్యే పురుషార్థాన్ని చేస్తేనే అలా అవుతారు కదా, ఇందులో కష్టమైన విషయమేదీ లేదు. ఈ జ్ఞానాన్ని ఇప్పుడు మీరు వింటారు, ఇది మళ్ళీ కనుమరుగైపోతుంది. గీతను చదివి వినిపిస్తారు కానీ ఈ జ్ఞానాన్ని అయితే వినిపించలేరు. అవి భక్తి మార్గం కొరకు పుస్తకాలు. భక్తి మార్గం కొరకు ఎంతో సామాగ్రి ఉంది, ఎన్నో శాస్త్రాలు ఉన్నాయి, ఒక్కొక్కరూ ఒక్కొక్కటి చదువుతూ ఉంటారు, ఒక్కొక్కరూ ఒక్కొక్కటి చేస్తూ ఉంటారు. రాముని మందిరములోకి వెళ్తారు, రాముడిని కూడా నల్లగా చూపించారు. అలా నల్లగా ఎందుకు చూపిస్తారు అని ఆలోచించాలి. కలకత్తా కాళి కూడా ఉన్నారు, తల్లీ-తల్లీ అంటూ హైరానా పడిపోతారు, ఆమె అందరికన్నా నల్లగా ఉంటారు మరియు చాలా భయంకరంగా చూపిస్తారు. ఆమెను మళ్ళీ మాత అని అంటారు. మీకు ఈ జ్ఞాన బాణాలు, జ్ఞాన ఖడ్గాలు మొదలైనవి ఉన్నాయి కావున వారికి ఆయుధాలను ధరింపజేశారు. వాస్తవానికి ఇంతకుముందు కాళి పేరు మీద మనుష్యులను బలి ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం దానిని ఆపివేసింది. ఇంతకుముందు సింధ్ లో దేవీ మందిరం ఉండేది కాదు. బాంబు పేలినప్పుడు ఒక బ్రాహ్మణుడు అన్నారు - నాకు కాళి కనిపించింది, ఇక్కడ నా మందిరము లేదు, త్వరగా నిర్మించండి లేకపోతే ఇంకా బాంబులు పేలుతాయి అని చెప్పింది అని. అంతే, చాలా ధనం పోగయ్యింది, మందిరం తయారయ్యింది. ఇప్పుడు చూడండి, ఎన్నో మందిరాలు ఉన్నాయి. ఎన్ని చోట్ల భ్రమిస్తూ ఉంటారు. తండ్రి మిమ్మల్ని వీటన్నింటి నుండి విముక్తులను చేయడానికి అర్థం చేయిస్తారు, అంతేకానీ ఎవరి గ్లానిని చేయరు. తండ్రి డ్రామాను అర్థం చేయిస్తారు. ఈ సృష్టిచక్రం ఎలా తయారయ్యిందో అర్థం చేయిస్తారు. మీరు ఏదైతే చూశారో అదంతా మళ్ళీ జరుగుతుంది. ఏ వస్తువైతే లేదో అది మళ్ళీ తయారవుతుంది. మా రాజ్యం ఉండేది, దానిని మేము పోగొట్టుకున్నాము అని మీరు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ తండ్రి అంటారు - పిల్లలూ, నరుని నుండి నారాయణునిగా అవ్వాలంటే పురుషార్థము చేయండి. భక్తి మార్గంలో మీరు ఎన్నో కథలను వింటూ వచ్చారు. అమరకథను విన్నారు కానీ ఎవరైనా అమరులుగా అయ్యారా? ఎవరికైనా జ్ఞానము యొక్క మూడవ నేత్రము లభించిందా? ఈ విషయాలను తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఈ కనుల ద్వారా ఎటువంటి అశుద్ధతనూ చూడకండి. పవిత్రమైన నేత్రాలతో చూడండి, అశుద్ధ నేత్రాలతో కాదు. ఈ పాత ప్రపంచాన్ని చూడకండి. ఇది అంతమైపోనున్నది. తండ్రి అంటారు - మధురాతి మధురమైన పిల్లలూ, నేను మీకు 21 జన్మల కొరకు రాజ్యాన్ని ఇచ్చి వెళ్తాను. అక్కడ ఇంకెవ్వరి రాజ్యమూ ఉండదు, దుఃఖము అన్న మాటే ఉండదు, మీరు చాలా సుఖముగా మరియు ధనవంతులుగా ఉంటారు. ఇక్కడైతే మనుష్యులు ఎంతగా ఆకలితో మరణిస్తూ ఉంటారు. అక్కడైతే మొత్తం విశ్వమంతటిపైనా మీరు రాజ్యం చేస్తారు. దానికి ఎంత కొద్ది భూమి కావాలి. చిన్న తోట మళ్ళీ వృద్ధి చెందుతూ, చెందుతూ కలియుగాంతం వచ్చేటప్పటికి ఎంత పెద్దగా అయిపోతుంది, మరియు పంచ వికారాలు ప్రవేశించిన కారణముగా అది ముళ్ళ అడవిగా అయిపోతుంది. తండ్రి అంటారు, కామం మహాశత్రువు, దీని వల్ల మీరు ఆదిమధ్యాంతాలూ దుఃఖాన్ని పొందుతారు. జ్ఞానాన్ని మరియు భక్తిని కూడా ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. వినాశనం ఎదురుగా ఉన్నది కావున ఇప్పుడిక త్వరత్వరగా పురుషార్థము చేయాలి, లేకపోతే పాపాలు భస్మమవ్వవు. తండ్రి స్మృతి ద్వారానే పాపాలు అంతమవుతాయి. పతిత-పావనుడు ఒక్క తండ్రే. కల్పపూర్వము ఎవరైతే పురుషార్థము చేసారో వారు తప్పకుండా చేసి చూపిస్తారు. చల్లబడిపోకండి. ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ స్మృతి చేయకండి.

అందరూ దుఃఖాన్ని ఇచ్చేవారే. ఎవరైతే సదా సుఖాన్ని ఇస్తారో వారిని గుర్తుంచుకోండి, ఇందులో నిర్లక్ష్యం చేయకూడదు. స్మృతి చేయకపోతే పావనంగా ఎలా అవుతారు? అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ కళ్ళతో చెడును చూడకూడదు. తండ్రి ఏదైతే జ్ఞానము యొక్క మూడవ నేత్రాన్ని ఇచ్చారో, ఆ పవిత్రమైన నేత్రంతోనే చూడాలి. సతోప్రధానంగా అయ్యేందుకు పూర్తి పురుషార్థం చేయాలి.

2. గృహస్థ వ్యవహారాన్ని సంభాళిస్తూ ప్రియమైనవారైన తండ్రిని స్మృతి చేయాలి. అవస్థను ఎలా తయారుచేసుకోవాలంటే అంత్యకలములో ఒక్క తండ్రి తప్ప ఇంకేదీ గుర్తుకురాకూడదు.

వరదానము:- తమ శ్రేష్ఠ వృత్తి ద్వారా విశ్వం యొక్క వాతావరణాన్ని పరివర్తన చేసే ఆధారమూర్త భవ

పిల్లలైన మీరు కేవలం మీ జీవితం కొరకే ఆధారం కాదు కానీ విశ్వములోని సర్వాత్మల కొరకు ఆధారమూర్తులు. మీ శ్రేష్ఠ వృత్తి ద్వారా విశ్వం యొక్క వాతావరణం పరివర్తన అవుతూ ఉంది. మీ పవిత్ర దృష్టితో విశ్వంలోని ఆత్మలు మరియు ప్రకృతి, రెండూ పవిత్రంగా అవుతూ ఉన్నాయి. దృష్టితో సృష్టి మారుతూ ఉంది. మీ శ్రేష్ఠ కర్మల ద్వారా శ్రేష్ఠాచారీ ప్రపంచం తయారవుతూ ఉంది. ఇప్పుడు ఎప్పుడైతే మీరు ఇంత పెద్ద బాధ్యతకు కిరీటధారులుగా అవుతారో, అప్పుడు భవిష్యత్తులో కిరీటము, సింహాసనము లభిస్తాయి.

స్లోగన్:- సర్వశక్తివంతుడైన తండ్రిని మీ సహచరునిగా చేసుకున్నట్లయితే ఏ విఘ్నమూ మిమ్మల్ని ఆపలేదు.